క్లుప్తంగా

మద్యం బాటిళ్ల స్వాధీనం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాలనీ రోడ్‌లో సోమవారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దారం చెప్పలయ్యను సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి. రవికుమార్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. చింతకొమ్మదిన్నె మండలం పోలుగారిపల్లె హరిజనవాడకు చెందిన నిందితుడు చెప్పలయ్య కడప ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఓ బార్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అతన్ని అరెస్ట్ చేసిన పోలీసులు 28 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేశారు.

పర్యాటక చిత్రమాలిక ఆవిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం పర్యాటక చిత్రమాలికను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష ఆవిష్కరించారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్, విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి ప్రపంచ వ్యాప్తంగాగల పర్యాటక ప్రాంతాలను సందర్శించి సేకరించిన ఛాయాచిత్రాల మాలికను రచయితతో కలిసి ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గురివిరెడ్డి, కళాశాల పర్యాటక విభాగం ప్రతినిధులు డాక్టర్ గురు మోహన్‌రెడ్డి, నాగవేణి, అరుణ పాల్గొన్నారు.

నేడు ఉచిత సంతాన సాఫల్య శిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద

కడప రూరల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్‌లో మంగళవారం ఉచిత సంతాన సాఫల్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు సంతాన సాఫల్య వైద్యులు, లాప్రోస్కోపీ సర్జన్ వై ప్రమోద తెలిపారు. సోమవారం స్థానిక ఆ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంతానం లేని దంపతులు చింతించాల్సిన అవసరం లేదన్నారు. సంతాన ప్రాప్తికి తమ క్లినిక్‌లో ఆధునిక వైద్య సేవలు కలవన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు సెల్ నంబరు 7995629110 కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


కటిక వీధిలోని డ్రైనేజీ గుంత

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని కటిక వీధిలో ఉన్న డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ గుంతపై వేసిన గ్రిల్స్ ఊడిపోయి కాలువలో పడిపోయింది. వాహనదారులుగానీ, పాదచారులుగానీ ఏమరుపాటున ఇందులో పడితే ప్రమాదం జరుగక తప్పదు. నగరపాలక అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

భాషావేత్త 'గిడుగు'కు నివాళి

కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్: తెలుగు వ్యావహారిక భాష కోసం జీవితాంతం కృషి చేసిన భాషా వేత్త గిడుగు రామమూర్తి పంతులు అని కొండ పాలకొండయ్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె.గోపీనాథ్ అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన స్థానిక శంకరాపురంలోని తన కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయల్ కరీముల్లా, మునెయ్య, బాషామోదీన్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్ : ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు శివనాగేంద్ర కుమార్, కిరణ్, సాయిగోపీనాథ్ సోమవారం సాయంత్రం మట్కా బీటర్ల కార్యకలాపాలపై నిఘా వుంచారు. కడప నగరంలోని మూసివేసిన విశ్వం హాల్ వద్ద కడప నగరం నకాష్‌కు చెందిన సయ్యద్ తబరేష్ బాష అనే వ్యక్తి మట్కా రాస్తుండగా అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.10,360, రెండు మట్కా స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

బహుమతులు అందజేత


విజేతకు బహుమతి అందజేస్తున్న ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శివరామిరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సంబరాల సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో వారం వారం లక్కీ బంపర్ డ్రాలు తీశామని షాపింగ్ మాల్ మేనేజర్ కృష్ణారెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ నుండి షాపింగ్ మాల్లో కొన్నవారి లక్కీ బంపర్ డ్రా కార్యక్రమానికి కడప ఆర్డీవో మధుసూదన్ రావు, తహసీల్దార్ శివరామి రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారన్నారు. బంపర్ డ్రాలో గెలుపొందిన సుధాకర్ బాబు, జి.వెంకట శివారెడ్డిలకు కార్లు అందజేశారు. ఆ ఇద్దరితోపాటు 40 మందికి స్మార్ట్ టీవీలు, స్మార్ట్ వాచీలు, వెండి గ్లాసులు అందజేశారు.

జయ జయరామ్.. జై శ్రీరామ్


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

- విగ్రహ ప్రతిష్ఠను వీక్షించిన భక్తులు
- ఘనంగా శ్రీ సీతారాములకు పూజలు


కోదండ రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చూస్తున్న భక్తులు

కడప కల్చరల్ : అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో భారీ సంఖ్యలో భక్తులు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దర్శించారు. నగరానికి చెందిన పలు దేవాలయాల నిర్వహణ కమిటీలు, హిందూ ధార్మిక సంస్థలు, మహిళా ధార్మిక సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 7 గంటలకే ఆలయానికి చేరుకున్నాయి. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆలయంలో ప్రధాన వేదికపై హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం, పూజలు నిర్వహించారు.

తిలకించి పులకించిన భక్తజనం

అనంతరం నిర్వాహకులు ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ పూర్వాంగ కార్యక్రమాలను ప్రదర్శించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధాన ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ధార్మిక మండపం నిండిపోయింది. పలువురు భక్తులు బయటే ఉండిపోవాల్సి వచ్చింది. వారు జై శ్రీరామ్ నినాదాలు చేస్తుండగా, ఆ ప్రాంతం శ్రీరామనవమి సందడిని తలపించింది. ఎల్‌ఈడీ స్క్రీన్‌పై శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను తిలకిస్తూ ఆనంద పారవశ్యంతో జై శ్రీరామ్ అంటూ భక్తులు నినాదాలు చేశారు. పలువురు భక్తులు శ్రీరాముడిని స్తుతిస్తూ భక్తిగీతాలను ఆలపించారు.

అనంతరం దాదాపు మూడు వేల మందికి పైగా భక్తులకు నిర్వాహకులు అన్నదానాలు చేశారు. నగరంలో పలుచోట్ల స్థానిక ప్రముఖులు ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి శ్రీరామ ప్రతిష్ఠను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

ఆకాశదీపం

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన భక్తులు ప్రత్యేక బృందంగా ఏర్పడి స్థానిక పాలకొండల వద్దగల నగరవనం కొండల్లో శ్రీరామ మహాజ్యోతిని వెలిగించారు. తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో నగరానికి చెందిన పలువురు భక్తులు ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ప్రత్యేకంగా తరలి వెళ్లారు. మారెమ్మ ఆలయ ధర్మకర్త సట్టి భారవి ఆధ్వర్యంలో దాదాపు 25 మీటర్ల వస్త్రాన్ని 125 లీటర్ల నెయ్యితో తడిపి సాయంత్రం 6.45 గంటలకు శ్రీరామమహాజ్యోతిని వెలిగించారు. జై శ్రీరామ్ నినాదాలతో యువత నృత్యాలు చేశారు. ఆ దీపాన్నిపలువురు భక్తులు ఆసక్తిగా దర్శించుకున్నారు.

పానకం పంపిణీ


నబీకోట రామాలయం వద్ద అన్నదానం చేస్తున్న కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి

కడప కార్పొరేషన్ : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో ప్రజలకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

■ బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్స్ ద్వారా వీక్షించే అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నేతలు కల్పించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు పాకా సురేష్ కుమార్, 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, కాంట్రాక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డి వరకుమార్ ఆధ్వర్యంలో నబీకోట రామాలయం వద్ద ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు రంతు అంజి, భద్రయ్య, శ్రీనివాస్, వినోద్ కుమార్‌రెడ్డి, బాలాజీ, శ్రీను, నాగయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం


ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండి వీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీ సీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

అయోధ్యలోని శ్రీరామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న సందర్భంగా బెల్లంమండివీధికి చెందిన భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.వెంకట రవికుమార్‌తోపాటు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివజ్యోతులతో సంఘీభావం


మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివజ్యోతుల వద్ద భక్తులు

కడప కల్చరల్ : అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠకు సంఘీభావం తెలుపుతూ స్థానిక మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివజ్యోతులు వెలిగించారు. సోమవారం ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఆలూరి రవిశంకర్, మల్లేశ్వరశాస్త్రిలు భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో శివజ్యోతులను అలంకరించారు. శివలింగం చిత్రంలో శ్రీరాముని ఆకారాన్ని చిత్రించి జై శ్రీరామ్ అక్షరాలను దీపాలతో వెలిగించారు.

ఎల్‌ఐసీ జీవన్ ధార పెన్షన్ ప్లాన్ ప్రారంభం


ఎల్‌ఐసీ నూతన పాలసీ ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

కడప కల్చరల్ : సరళమైన పాలసీ నిబంధనలతో, రెగ్యులర్ పద్ధతిన ప్రీమియం చెల్లించే అవకాశాలున్న, గ్యారెంటీడ్ పెన్షన్ (యాన్యుటీ) ప్లాన్ జీవన్ ధార-2 పాలసీని ఆదరించాలని ఎల్‌ఐసి మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్రావు పిలుపునిచ్చారు. ఈ నూతన పాలసీ బ్రోచర్ల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీవన్ ధార-1 పాలసీ గతంలో మంచి ప్రయోజనాలను ఇచ్చిన నేపథ్యంలో, డెఫర్డ్ యాన్యుటీ ఇచ్చే జీవన్ ధార - 2 మార్కెట్లో అద్భుతాలు సృష్టించబోతున్నదన్నారు. ఇది పెన్షన్ సదుపాయమే లేని ఉద్యోగాల్లో, వృత్తుల్లో ఉన్నవారికి, నామమాత్రపు ఫ్యామిలీ పెన్షన్ లభిస్తున్న వారికి, మంచి సంపాదనలో ఉండి భవిష్యత్తులో పిల్లలకు ఒక రెగ్యులర్ ఆదాయ వనరు సమకూర్చాలనుకునే తల్లిదండ్రులకు ఇది మరింత ఆకర్షణీయమైన పాలసీ అన్నారు. ప్రస్తుత ఎల్‌ఐసీ పాలసీదారులకు, సామూహిక బీమా లబ్ధిదారులకు ఇతరులతో పోల్చినప్పుడు ఈ పాలసీ కింద మెరుగైన యాన్యుటీ రేట్లు ఎల్‌ఐసి ఇస్తుందని అన్నారు. వైద్య పరీక్ష అవసరం లేకుండా, 20 నుండి 80 సంవత్సరాల వయసున్న వారికి ఈ పాలసీ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర మేనేజర్లు సత్య శ్రీనివాస్, రాము నాయక్, మహీధర్, గురునాథాచారి పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు శివయాదవ్

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు కొప్పల శివ యాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు బీసీ నాయకులు ఈ విషయం అర్థం చేసుకోకుండా విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు.

సీఎం వైఎస్ జగన్ తన మంత్రి వర్గంలో 10 మంది బీసీలకు మంత్రి పదవులు, రెండు రాజ్యసభ పదవులు ఇవ్వడం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం బీసీ సామాజిక వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న విషయాన్ని తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు లక్షుమయ్య, ఎం. సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయశ్రీ, 22వ డివిజన్ ఇన్‌చార్జి రామచంద్ర పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


అగ్నిమాపక విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి సూచించారు. పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన సురక్షిత చర్యలపై జిల్లా అగ్నిమాపక కేంద్ర సిబ్బంది సోమవారం కడప ఏపీహెచ్‌బి కాలనీలోని యూరోకిడ్స్ ప్రీ స్కూల్‌లో డ్రిల్ నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

తదుపరి అగ్నిని ఆర్పే యంత్రాలు, ఎమర్జెన్సీ అండ్ రెస్క్యూ టూల్స్ వారికి చూపించి వాటి ప్రాముఖ్యతను డెమో ద్వారా తెలియచేశారు.

వైఎస్సార్ ఆశయాల సాధన జగన్‌తోనే సాధ్యం

జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి


మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్ఆర్ ఆశయాల సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీతో ఇండియా కూటమి, సోనియా, రాహుల్ ఆశయాలే అమలవుతాయని ఎద్దేవా చేశారు.

సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన షర్మిల పదవి రాగానే వైఎస్సార్‌సీపీపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ గతంలో గొప్ప పార్టీ కావచ్చేమోగానీ, వారు అనుసరించిన నియంతృత్వ పోకడల వల్ల ఆ పార్టీ ప్రతిష్ఠ మసకబారిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉండాలని వైఎస్సార్ కోరుకున్నారని, కానీ కాంగ్రెస్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి, ఇటు రాష్ట్ర ప్రజలను, అటు వైఎస్సార్ కుటుంబాన్ని క్షోభ పెట్టిందన్నారు. గతంలో షర్మిలమ్మే ఈ విషయాలను చెప్పారన్నారు. రైతును రాజు చేయాలని వైఎస్సార్ భావించారని, ఆయన కోరిక మేరకు సీఎం జగన్ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్ఆర్ ఆశయ సాధనలో భాగంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారు. వైఎస్సార్ కలనేగాక, గాంధీజీ, అంబేడ్కర్ కన్న కలలను కూడా వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. వైఎస్సార్ ఆశయం ఏమిటో షర్మిలమ్మ ఆలోచించాలని, ఆమె పోరాటం రాహుల్ ఆశయాల కోసమేనని ఎద్దేవా చేశారు ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పసుపు యార్డులో శీతల గిడ్డంగి నిర్వహించరాదు

కడప అగ్రికల్చర్ : కడప పసుపుమార్కెట్ యార్డులో శీతల గిడ్డంగిని నిర్వహించ కూడదని, ఇది నిబంధనలకు విరుద్ధం అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి వైవీ సుదర్శన్ రెడ్డిలు అన్నారు. ఈ విషయమై సోమవారం కడప మార్కెట్‌యార్డులో సెక్రటరీ వెంకటరెడ్డిని కలిసి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. మార్కెట్ యార్డు నిబంధనల ప్రకారం పసుపు యార్డులో ఫ్రూట్ మండీకి సంబంధించిన శీతల గిడ్డంగిని ఎలా నిర్వహిస్తారన్నారు.

అక్రమ అరెస్టు తగదు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లపై నిర్బంధాన్ని విధిస్తూ అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ తరుపున ఖండిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం కడపలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు తమ హక్కులను సాధించుకోవడం కోసం సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఎక్కడికక్కడ అరెస్టులు చేసి ఉద్యమాన్ని విచ్చిన్నం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేసిందన్నారు.

న్యాయం చేయండి సారూ

కమలాపురం : పిల్లల పెండ్లిళ్లకు అని పోగు చేసుకున్న సొమ్ము అంతా పోస్టల్ అధికారిణి స్వాహా చేసింది.. తమకు న్యాయం చేయాలని పందిళ్లపల్లె పోస్టల్ బాధితులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని ఆశ్రయించారు. సోమవారం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే వద్దకు బాధిత మహిళలు చేరుకున్నారు. తినీ తినక పిల్లల పెండ్లిళ్లకని డబ్బులు పోస్టాఫీసులో పోగు చేసుకున్నామని.. పోస్టల్ అధికారిణి తమ సొమ్మంతా దాదాపు రూ. 1.20కోట్లు వరకు స్వాహా చేసి ఉడాయించిందని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి జిల్లా ఎస్పీ కి ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

ముగిసిన శిక్షణ

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి డివిజనల్ గణాంకాధికారి రామమోహన్, కమలాపురం సహాయ గణాంకాధికారి ఇర్షద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ఆవశ్యకత గురించి రైతు భరోసా సిబ్బందికి వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు 15రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత


నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 57 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం అర్జీలు- 14, టౌన్ ప్లానింగ్ విభాగం- 21, రెవెన్యూ విభాగం- 6, హెల్త్ విభాగం -2, యూపీఏ విభాగం- 5, కడప తహసీల్దార్-2, సచివాలయ విభాగం-5, హౌసింగ్ విభాగం అర్జీలు-2 వచ్చాయి. ఈ అర్జీలను కేటాయించిన సమయానికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శానిటేషన్ విభాగ అధికారులతో మాట్లాడుతూ కడప నగరంలో వందశాతం ఇంటింటి చెత్త సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా, కేటాయించిన సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని, అనుమతి లేని ఫ్లెక్సీలను ఎప్పటికప్పుడు తీసివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు.

సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలి..

డిసెంబర్ 26 నుంచి ఈనెల 12వ తేదీ వరకూ జరిగిన సమ్మె సందర్భంగా చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం వారు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వీవీ సుబ్బయ్య, ఓబులేసు, కె. తిరుపాల్, ఎస్. రవి, ఇ. ప్రకాష్, వి. శ్రీధర్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన మద్యం ధ్వంసం


కాలం చెల్లిన మద్యాన్ని పారబోస్తున్న ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని కాలం చెల్లిన మద్యాన్ని ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు ధ్వంసం చేశారు. సోమవారం కడప ఏపీఎస్‌బీసీఎల్ డివిజన్ పరిధిలోని సీకేదిన్నె, బుగ్గలేటిపల్లె, ఇందిరానగర్, శాటిలైట్ సిటీ, అలంఖాన్‌పల్లె, ఖాజీపేట ప్రాంతాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 2021 డిసెంబర్ నుంచి ఉన్న పాత వైన్‌లు, మద్యం బాటిళ్లను డిపో మేనేజర్ శ్రీధర్‌రావు ఆదేశాల మేరకు ఎస్ఐ జహీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌బీసీఎల్ కానిస్టేబుల్ జయరామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి అండగా ప్రభుత్వం

– కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తదితరులు

వేంపల్లి : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరాంపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్‌క్లీనిక్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ.. ప్రభుత్వమే రైతులనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారని తెలిపారు. వేంపల్లి జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచులు శ్రీనివాసులు, మునేష్, మాజీ సర్పంచ్ రామాంజనేయులరెడ్డి, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలు

- ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, పార్టీ పుట్టినప్పటి నుంచి కార్యకర్తలు ఇష్టపూర్వకంగా పనిచేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కార్యకర్తలను కొనియాడారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అధ్యక్షతన నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన పార్టీ ప్రజల మనసు, హృదయాల్లో నుంచి పుట్టుకొచ్చిందన్నారు. మేనిఫెస్టోను ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన పార్టీ కూడా మనదేనన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఎక్కడైనా వర్గ విభేదాలు ఉంటే వాటిని పక్కన పెట్టి సమస్యలను అధిగమించి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. పార్టీలో ఉంటే ఎప్పటికైనా న్యాయం జరుగుతుందన్నారు. మెనిఫెస్టోలో 690 హామీలిచ్చి చంద్రబాబు విస్మరించాడని, జగనన్న అందుకు భిన్నంగా చెప్పని హామీలను సైతం అమలు చేశారన్నారు. 85శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రస్తుతం ప్రతి కార్యకర్త ప్రతి ఇంటి తలుపు తట్టి వారు పొందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీలో ఉన్న క్యాడర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నెల 25న వైజాగ్‌లోని భీమిలిలో సీఎం వైఎస్ జగన్ క్యాడర్‌తో సమావేశం నిర్వహిస్తున్నారని, ఇందులో క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, చెన్నకేశవ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, మస్తానయ్య, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, హిదాయత్, ఇస్మాయిల్, భాస్కర్, లక్ష్మీనారాయణ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, దేవదానం, నిఖిల్‌రెడ్డి, సుధీర్, శ్రీరాం రమణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.